# ఆ మోడూ ఈ ముసిలాడూ

-అవసరాల రామకృష్ణారావు

తడిక గేటు తీసుకుని ఇతవలికి వస్తూనే ఆ అడవి చెట్టు మోడువైపు కళ్లు చిట్లించుకుంటూ చూశాడు అప్పలసూరి. తన కండబలాన్ని సవాలు చేసే దాన్ని గమనించిన కొద్దీ ఒళ్లు మండిపోతుందనికి. అటూ ఇటూ వరసగా ఏటవాలు జాగాల్ని ఆక్రమించుకుని వేసుకున్న ఆ కొండకోన కాలనీ పాకల్లో తన పాక ఎడమవైపు వరసల్లో అన్నిటికన్న చివరగా ఎత్తుగా ఉన్న చోటున వేసుకున్నది. ఇక ఆపైన అంతా చిట్టడివే. అందులో తన పాకవైపు ఏభై గజాల దూరంలో ఓ బ్రహ్మాండమైన చెట్టుండేది. దాని పేరు తెలీక అడవి చెట్టనేవారు. కాలనీ వాసులంతా ఎవరి శక్తికొద్దీ వారు ఆ చెట్టుని తెగ్గొట్టుకుని వాడుకున్నారు. ఆ మొండి మొదల్ని నేలమట్టం చెయ్యటం మాత్రం ఎవరి తరమూ అయింది కాదు. దాన్ని తొలగించగలిగితే పది చదరపు అడుగుల జాగా అయినా కలసి వస్తుంది. తన పాక పరిధి పెంచుకోవచ్చు. ఎన్ని ప్రయత్నాలు చేసినా, మరి లోపల ఏ సహజమైన రాతి పునాదిలో ఎంతెంత పెద్ద వేళ్లు దింపుకుని ఉందో, ఎంతటి పదునైన పరికరం పోటుకీ లొంగిరావడం లేదు. ఇలాంటి వాటిని పెకలించడానికి ఏవో యంత్రాలు ఉంటాయనీ, ఏ ఇంజనీరు బాబునో ఈ కొండెక్కించి చూపిస్తే ఏదో ఓ దారి చూపించకపోడనీ అప్పలసూరి ఇంకా నమ్ము తున్నాడు. 'సిలకమ్మా, ఎలకన్నా ఏరుపడ్డాకే ఏదైనా' అనే ఊహతో అతని ఒళ్లు పులకరించింది.


నిండు చూలాలు అయిన అతని పెళ్లాం పేరే చిలకమ్మ. కనబోయే బిడ్డకి వాళ్లిద్దరూ ముద్దుగా పెట్టుకున్న ముందస్తు పేరే ఎలకన్న. ఆడపిల్ల పుట్టినా సరే ఎలకన్న అనే పేరే స్థిరం చేసేశారు. కొత్త ప్రాణి మాటకేం గాని ఉన్న జోడును తలుచుకుంటే అప్పలసూరి మనసు అదోలా అయిపోతుంది.

మొగతనం అంటూ ఒంటి మీదకి వచ్చాక, అప్పలసూరికి బతుకు నేర్పినవి రెండేరెండు. పగలంతా ఏది దొరికితే ఆ పని కష్టపడి చేశాక పొద్దు ఎలా గడిచేదని? ఇటు కల్లుపాకో అటు గళ్లకోకో, అంతే. కాలనీ మెట్ల దగ్గిర మదుం మీద పడుండే తండ్రి పైడి తల్లిగాడు లేకపోలేదు గాని వాడి ధోరణి వాడిదే. ఇక ఈ చిలకమ్మ? 'దాని ఎవ్వారమే ఏరు' 'కొమ్మ మీద వాలడానికి ముందుగా కొమ్మ అనుమతి తీసుకుంటుందా చిలక? మనసైన మగాడి గుండెల్లో గూడుకట్టి కూచోడానికి ఒకర్ని అడిగేదేమిటి!' అనేటంత జల్సా జబర్దస్తీతో అప్పలసూరి చేత పసుపుతాడు ముడేయించుకుంది చిలకమ్మ. ఓ మనిషి పుట్టు పూర్వోత్తరాల కన్న నిత్య వ్యవహార శైలి ఎంత గొప్పదో నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది చిలకమ్మ. దాని ఆలోచనలు వాడు మరచిపోలేదు. కడుపు నిండా తినడమే కాదు, కమ్మగా తొంగుంటుండాలి. దానికో కమ్మరేకుల కప్పు కావాలి.

కొండమీద కోటి దేవుళ్లే తలదాచుకోగా లేంది, మనిషికి అక్కడ జానెడు జాగా దొరకదా! ఆలికి ముగ్గులెట్టడం తెలియాలి గాని ఎలాంటి ఎగుడు దిగుడు జాగా అయితేనేం?

తనైతే వెళ్లలేదు గాని అప్పలసూరి ఏ పని జవసత్వాలయినా చిలకమ్మ నుంచి అందుకున్నవే.

అంతకు ముందైతే మిరపకాయ బజ్జీ అమ్ముకునే తోపుడు బండీ మాత్రమే అతని ఇల్లూ వాకిలీ అయి ఉండేది. తూము దగ్గిర రాళ్లతో మోపుచేసిన బండీపైనే తండ్రీ కొడుకూ ఎలాగో అలా సద్దుకు పడుకునేవారు. చినుకులు పడితే దాని కిందే ముసుగులు తన్నేసేవారు. మరి చిలకమ్మ కాపరానికి వచ్చాక? ఓ గోడ పడిపోయిన ఊరి చివరి సత్రం కాపరానికి అది ఎన్నాళ్లో మొగ్గు చూపలేదు. నిమిషాల మీద కొండకోన కాలనీ వైపు దృష్టి మళ్లించింది. అప్పటికే ఆ కాలనీ జాగాలన్నీ ఆక్రమణం అయిపోయాయి. ఆ వార్డు మెంబరు అట్టడుగు కుటుంబాల్ని ఓ చోటకి రప్పించి ఏవో స్టాంపు



కాగితాలు చూపించి ఆ కొండవైపు ఆ భాగమంతా తనదే అని దబాయించాడు. అప్పట్లో 'నిలవ నీడ లేని బడుగు జనం కోసమే నా తాపత్రయం. ఎదుటి పార్టీ వాళ్లు ఎంతగా అడ్డుపెట్టినా మీ ఇరవై కుటుంబాల వాళ్లకీ ఈ ప్లాట్లు ఫ్రీగా ఇప్పిస్తున్నాను. ఆ జాగాలో పాకే వేసుకుంటారో పెంకుటిల్లే దింపుకుంటారో మీ యిష్టం. అయితే అంతెత్తున మీమీ యిళ్లకు చేరుకోడానికి ఓ మోస్తరు రాతి మెట్లయినా కట్టించాలి కదా... కిందనో కొళాయి కనెక్షను శాంక్షను చేయించాలి కదా... తలో పది వేలూ కట్టుకోండి! అంటూ వసూలు చేసుకున్నాడు. మనకి మనం ఉన్నాం కాదూ! మనకో జాగా సంపాదించుకోలేకపోతామా! భూమ్మీద అయితే దొరక్కపోవచ్చు గాని కొండకి కొలతేమిటి! అంటూ తన రెండు తులాల నల్లపూసల దండ వార్డు మెంబరు చేతిలో బయానాగా పెట్టి తమదంటూ ఓ జాగా వచ్చేలా చూసుకుంది.

అయితే చిలకమ్మ పైడితల్లి గాణ్ణి మాత్రం తోపుడు బండి పానుపు మీంచి పైకి రప్పించలేకపోయింది. 'ముదుకుల సలుపుల ముసిలి ముండా వోణ్ణి. అన్ని మెట్లెక్కి అంతెత్తుకి ఎగబాకమంటే నాకెక్కడ కుదుర్ది!' అని పైకంటే అన్నాడు గాని

అక్కణ్ణుంచి కదలకపోడానికి వాడి కారణం వాడికి ఉండనే ఉంది. తోపుడు బండీని కొడుకు తోసుకెళ్లాక ఉంటే కొత్తది ముట్టించి పొగ పైకి వదుల్తూనో, లేదా పాత చుట్ట పీక నమిలి రసం లోపలికి పీలుస్తూనో, మదుంమీద అటు కూచుని మెట్లెక్కి ఇటేపు కొళాయి దగ్గిరకొచ్చే జనాన్ని అదమాయించడం, పైడితల్లికో గొప్ప కాలక్షేపం. ఎప్పుడో మిలట్రీలో ఓ టెంపరరీ ప్యూను పోస్టు వెలిగించి రెండు నెలలు దాటకుండానే డిస్మిస్ అయాట్ట పైడితల్లి. అయినా లోకాన్నంతా ఓ క్రమశిక్షణలో పెడదామనే కోరిక వాడి నరనరానా పట్టిపోయింది. అసలే అరగంట మించి కార్పొరేషన్ నీళ్లు రావు. అక్కడే కొట్టుకుచావాల! వాళ్లనో పద్ధతిలో పెట్టాలని అంత దూరం నుంచే అరుస్తూ ఉంటాడు. ఏ ఒక్కరూ తన మాట వినరని తెలీక కాదు. గట్టుదాటని సముద్రమూ వేళపట్టున ఉదయించే సూర్యుడూ ఒకరి మెప్పు కోసం చేస్తున్నారా! తను కూడా తన డ్యూటీ చేస్తున్నాడు, అంతే!

ఒకప్పుడు ఎంత చల్లగా చూస్తుందో మరొకప్పుడు అంత అల్లకల్లోలమూ సృష్టిస్తుంది! అదే ప్రకృతి కాబోలు. ఉన్నట్టుంది పది పదిహేను రోజుల్లై గాలీ వానా పట్టుకుని ఆ కాలనీవాసుల జీవితాల్ని అస్తవ్యస్తం చేసిపారేసింది. ఎగుడు దిగుడు జాగాలో ఏళ్ల తరబడి ఎదురీత బతుకులకి అలవాటు పడిపోయిన ఆ కష్ట జీవుల మనసులు ఆ కొండరాళ్లతో సమానంగా ఎప్పుడో బండ బారిపోయి ఉన్నాయి. అయినా పట్టిన ముసురు వదల్లేదు. చెంపపెట్టు పెడుతున్నట్టున్న హోరు గాలి ఆగలేదు. మరెక్కడ ఏ కొండ శిఖరాన ఏ ఇనప

### ఆకలి

**ఆ**కలితో డాలరు
మింగాలనుకున్నాను!
కానీ అది–
నన్నూ, నా దేశాన్ని
మింగుతుంది.

–సాయి ప్రకాష్

గజ్జెల తల్లి కడివెడు దుఃఖంతో కుమిలిపోతోందో దిమ్మరిస్తున్న ఆ కుండపోతకీ, మెట్లనీ మట్టినీ కనపడకుండా పై నుంచి కిందకి ప్రవహిస్తున్న ఆ నీటి జోరుకీ అడ్డూ ఆపూ కనపడ్డం లేదు. వాటితో కొట్టుకొచ్చే గడ్డీ, చెత్తా, ఆకులూ, కొమ్మలూ సరేసరి. ఇవి చాలక ఒకటి రెండు రోజుల్లై ఓ మోస్తరు రాళ్లు పై నుంచి కిందకి దొర్లడం చూసి కాలనీవాసుల పై ప్రాణాలు పైనే పోయాయి. పైకప్పులు ఎగరగొడుతున్నాయి. మట్టి గోడల్ని ధ్వంసం చేస్తున్నాయి. ఏది చూసినా నానా భీభత్సంగానూ ఉంది. ప్రసార సాధనాల రక్షణ హెచ్చరికలు సరేసరి.

ఏమైతేనేం మూడొంతులు కాలనీవాసులు తట్టాబుట్టా చేతపట్టుకుని రక్షణ శిబిరాలు చేరుకున్నారు. వాళ్లతో పాటు పైడితల్లి కూడా ఆ పాడుపడిన ప్రైమరీ స్కూలు చేరుకున్నాడు. రక్షణ కోసం కాదు, తన క్రమశిక్షణని అక్కడా ప్రదర్శించే మహదవకాశం జారిపోనివ్వకూడదని!

ఏమొచ్చినా ఎవర్నీ లెక్కచెయ్యని అతికొద్ది మొండి మనుషులతో పాటు జగమొండి చిలకమ్మ కూడా పాక వదిలి పెట్టలేదు. ఈ వర్షం ఇప్పట్లో తగ్గేలా లేదు అనే గ్రహింపుకు వచ్చాక, తన తప్పు తెలుసుకుని, కిందకి దిగిపోదామని అది గట్టిగా అనుకునేసరికి, వేళ మించిపోయింది! నులక మంచం తిరగేసి దాని మీద ఆ నిండు చూలాల్ని పడుకోబెట్టి అప్పలసూరి కాక మరి ముగ్గురు సాయం పట్టి కిందకి దింపుదామనుకున్నా అడుగు పెడితే మెట్ల కింద ఆధారం మీద నమ్మకం లేక ఆ ఆలోచనకి స్వస్తి చెప్పేరు. అంతేకాదు, ఉన్నట్టుండి ఉరుములూ మెరుపులూ ఉధృతం అవడంతో ఆ ముగ్గురూ కూడా కిందకి పరుగులు తీశారు, తడిసి ముద్దయితే అయామని. ఇక బిక్కుబిక్కుమంటూ అక్కడున్నది పెద్దనొప్పులు అందుకుని మెలికలు తిరిగిపోతున్న చిలకమ్మా, దాని కుడిచేతిని గట్టిగా పట్టుకుని ఏం చెయ్యాలో తెలీక కొట్టుకుంటున్న అప్పలసూరీ. ఉన్న ప్రాణాలే ఉంటాయో ఊడతాయో తెలీని భయంకర వాతావరణంలో 'నేనూ వచ్చేస్తున్నానర్రోయ్' అన్నట్టు మరో కొత్త ప్రాణి మారాం. ఇంట్లో ఉన్న

ఆకులూ పాత గుడ్డలూ గోనెలూ ప్లాస్టిక్ గుడ్డలూ మాటున ఎలాగైతేనేం వాళ్లు కలగన్న ఎలకన్న 'క్యారింత' వినవచ్చింది. ఆతర్వాతి నాలుగైదు రోజుల్లో అపాయ ఉధృతం క్రమక్రమంగా తగ్గి ఆ కాలనీవాసులంతా ఎవరింటికి వారు చేరుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. కొమ్మలు మీద పడి గాలి ధాటికి నిలదొక్కుకోలేక ఓ పది మందయినా గాయాలపాలయి ఉంటారు. అత్యంత ప్రమాద స్థితిలో చిక్కుకున్నా చెక్కుచెదరని ఉక్కు పిండాలుగా చిలకమ్మనీ అప్పలసూరినీ చెప్పుకున్న అందర్నీ మించిన ఉద్దండ పిండం ఎలకన్న గాడిని, పుట్టి వారం దాటకుండానే ముట్టుకు ముద్దాడని వారు ఆ చుట్టుపట్ల ఎవరూ లేరేమో.

వాన బాగా వెలిసిన తొలిపొద్దున అప్పలసూరి ఎప్పట్లా విరిగిన తడకగేటుని కష్టపడి చేరేసి ఇవతలికొచ్చి అడవి చెట్టు మోడువైపు యధాలాపంగా చూశాడు. అంతే. కన్నార్పకుండా అలా ఉండిపోయాడు! కళ్లు నలుముకుని మరోసారి చూశాడు. దగ్గరకెళ్లి పరకాయించి చూశాడు. పై నుంచి దొర్లుకొచ్చిన ఓ పెద్ద బండరాయి ఆ మోడు దగ్గిర ఆగిపోయింది. అంటే? అంత పెద్ద బండరాయిని తన యింటి మీద పడకుండా ఆ మోడు ఆపినట్లయింది. ఆ మోడే అక్కడ లేకపోతే? లేదా తన పంతం నెగ్గించుకుని దాన్ని సమూలంగా నాశనం చేసి ఉంటే? అడగడానికి తను గాని వినడానికి చిలకమ్మ గాని ఇంతింత కళ్లూ వాడూ ఆ వెధవ ఎలకగాడు అవి విప్పి చూడడానికి గాని ఎవరూ ఉండేవారు కాదు!

దగ్గిరగా వెళ్లి మోడు మీద చెయ్యేసి అక్కడ కూలబడి తప్పు చేసిన భావనతో తల్లడిల్లిపోయాడు అప్పలసూరి. 'నువ్వు చెట్టుని రక్షిస్తే అది నిన్ను రక్షిస్తుంది' అనే మాట మొక్కలు నాటే కార్యక్రమాల్లో చెవుల్లో చిల్లులు పడేలా ఎన్నిసార్లో విన్నాడు. పచ్చని చెట్లయితే నీడనిస్తాయి, పళ్లనిస్తాయి, బతుకునిస్తాయి. కాని ఎంత కొట్టినా ఎదిరించి నిలబడిన మోడు బతుకులో కూడా ఇంత ఉపకార బుద్ధి ఉంచావా దేవుడా అనిపించి ఆకాశం వైపు చెయ్యెత్తి మొక్కేడు అప్పలసూరి.

అలా మోడుని చూస్తూ కూచుంటే అందులో తన తండ్రి పైడితల్లి కనిపించినట్లయి ఉలిక్కి పడ్డాడు అప్పలసూరి. 'డిసిప్లీను పిచ్చోడు' కింద చూశాడు గాని జన్మనిచ్చిన తన తండ్రిని ఓ మనిషిగా తను చూసిందెప్పుడు! 'సస్తే బావుణ్ణు, ముసిలి నాయాల' అనుకున్న రోజులు కూడా లేకపోలేదు, వాడి నోటంట వచ్చే బూతులు వినివిని, ఉమ్ములూ దగ్గులూ చుట్ట కంపూ భరించి భరించి ఎన్నిసార్లు ఎన్ని రకాలుగా నీచంగా చూశాడో... నిజానికి తన మిరపకాయ బజ్జీ తోపుడు బండి మరొకరు దొంగలించుకుపోకుండా ఉండడానికి వాడే కద కాపలా! రెండేళ్ళయి వచ్చిన పరాయిది చిలకమ్మ చూపించే ప్రేమలో కనిపెంచిన తండ్రికి తను చూపించింది ఎన్నో వంతు! ఓ చుట్ట ముక్క చేతిలో పెడితే ఒకేసారి సూర్య చంద్రులు ఉదయించినట్టు కళ్లల్లో కాంతులు వెదజల్లే అల్ప సంతోషి తన తండ్రికి తనేం చేసినట్టు! వాడక్కడ్నుంచి రానంటే అలా ఒదిలెయ్యడమేనా! రక్తమాంసాలు హరించి, జవసత్వాలు ఉడిగి ముసిలివాళ్లు ముళ్ల కంపల్లా తయారైతే వాళ్లనలా వదిలెయ్యడమేనా!

మొగుడెంతకీ రాకపోవడం గమనించి చిలకమ్మ నెమ్మదిగా అడుగులు వేస్తూ అక్కడికొచ్చి అప్పలసూరి భుజం మీద చెయ్యి వేసి ఇటు తిప్పుకుంది. ఆ విషాదానికి కారణం వాని నోటే వింది. చేసిన తప్పు ఏం చేసి దిద్దుకోవాలో వాడి చేతనే చెప్పించింది.

అప్పలసూరి ఇక ఆలస్యం చెయ్యలేదు. ఇంకా తడిగా బురదగా ఉన్న మెట్లని కూడా లెక్క పెట్టలేదు. ఒక్కసారి గెంతినంత వేగంగా తండ్రిని చేరుకున్నాడు. గుడ్డ చిరిగిన పాత పడక్కుర్చీలో ఉన్న పైడితల్లిని మడతపెట్టి గోడకి చారవేసినంత పొందికగా భుజానికెత్తుకున్నాడు. అంత తొందరగా అన్ని మెట్లూ పైకెలా ఎక్కాడో... తన పాకలో ఎలకన్న పక్కన కూలేశాడు. 'ఈ క్షణం నుంచీ మనకి ఒక్కరు కాదు ఇద్దరు పిల్లలు' అన్నంత ఆనందంగా చూసుకున్నారు ఆ మొగుడూ పెళ్లాలు ఒకర్నొకరు. పక్కకి ఒరిగిపోయిన కిటికీ లోంచి కనపడే మోడుకి మనసులోనే కైమోడ్పు చేస్తూ. ■